గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం

- ప్రత్యేక పాలనలోనూ పరిస్థితి అంతంతే
- వసతుల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పెన్‌పహాడ్ : గ్రామపంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం గత నెల నుంచి స్పెషల్ ఆఫీసర్లతో పాలనను ప్రారంభించింది. అయినా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు మాత్రం తీరడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. చెత్తను నిత్యం సేకరించాల్సిన పంచాయతీ కార్మికులు పర్యవేక్షణ లేకపోవడంతో నాలుగు, ఐదు రోజులకు ఒక్కసారి చెత్తను సేకరిస్తున్నారు. ఇటీవల గ్రామాల్లో స్వచ్ఛతా వారోత్సవాలు నిర్వహించినప్పటికీ ఎక్కడి చెత్త అక్కడే ఉంటుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం..

గ్రామాల్లో ముఖ్యంగా మౌలిక వసతుల కల్పన, తాగునీరు, డ్రెయినేజీల శుభ్రత, చెత్త సేకరణ వంటి పనులపై ప్రత్యేక అధికారులు దృష్టిసారించడం లేదని వాదనలు వినిపిస్తున్నాయి. గ్రామాలకు కేటాయించిన స్పెషల్ అధికారులు మొదటగా తాను పనిచేస్తున్న ప్రదేశాల్లో వృత్తికి ప్రాధాన్యం ఇస్తూ అనంతరం ఇన్‌చార్జ్ గ్రామాలకు రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికీ కొంత మంది గ్రామ స్పెషల్ అధికారి ఎవరో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో అధికారులు స్పందించి మంచినీటి కొరత లేకుండా చూడాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


నాగులపాటి అన్నారంలో డ్రెయినేజీ లేక రోడ్లపై పారుతున్న మురుగు

గ్రామాల్లో డ్రెయినేజీలు నిర్మించాలి

డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతుంది. దీంతో ప్రజలు రోగాలబారిన పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి గ్రామంలో వెంటనే డ్రెయినేజీ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– రవి, నాగులపాటి అన్నారం

సమస్యల పరిష్కారానికి కృషి



మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తాం. గ్రామాలకు నియమించిన ప్రత్యేక అధికారులకు తెలియజేసి ఏఏ గ్రామాల్లో ఏఏ సమస్యలు ఉన్నాయనే సమాచారం తెలుసుకుని సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ

సూర్యక్షేత్రంలో భక్తుల ప్రత్యేక పూజలు


సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : రాష్ట్రంలోని తొలి సూర్యక్షేత్రమైన జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురంలో గల అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. అనంతరం యజ్ఞశాలలో మహాసౌరహోమాన్ని నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామ కోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకులు కాకులారపు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, బీరవోలు ఇంద్రారెడ్డి, అర్చకులు మిర్యాల రామశర్మ, వేణుగోపాలశర్మ, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం అందజేత


విరాళం అందజేస్తున్న దాతలు

అర్వపల్లి : మండలంలోని కోడూరు గ్రామంలో పునర్నిర్మిస్తున్న శంభులింగేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం సూర్యాపేట పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన దేవులపల్లి హరిబాబు–శిరీష కుటుంబీకులు రూ.65,011 విరాళం అందజేశారు. పురాతనమైన ఆలయాన్ని దాతల సహకారంతో సుమారు రూ.2కోట్లతో పునర్నిర్మాణ పనులు చేపడుతున్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దొంగర మహేష్, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టపల్లి రాము యాదవ్, బిక్కి రమేష్‌గౌడ్, డాక్టర్ సిరిరాము, నిద్ర సంపత్‌నాయుడు, గడ్డం సైదులు, మన్నె కిష్టయ్య, బాకు ప్రభాకర్, నిద్ర దిలీప్, బిక్కి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మాచారం గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవీందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.5230 నగదు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

సంఘబంధం కమిటీ ఎన్నిక


మంజుల, అధ్యక్షురాలు

అర్వపల్లి : మండలంలోని బొల్లంపల్లి గ్రామ సంఘబంధం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కేసగాని మంజుల, ఉపాధ్యక్షురాలిగా ఎస్‌కె.మైబూబి, కార్యదర్శిగా కడారి అలివేలు, సహాయ కార్యదర్శిగా చంద్ర సబిత, కోశాధికారిగా కె.మమతలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లేష్, వీఓఏ పద్మ, మాజీ ఉపసర్పంచ్ కేసాని రామనర్సయ్య, కేసగాని మహేశ్వర్, రవీందర్, చిరంజీవి, సత్తయ్య, ఖమ్మంపాటి వెంకటేష్, జహంగీర్, చంద్రశేఖర్, రాజారాములు, లక్ష్మి నర్సు, మహిళలు పాల్గొన్నారు.

అర్వపల్లి ఎస్‌ఐగా యాకూబ్ బాధ్యత స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న యాకూబ్

అర్వపల్లి : అర్వపల్లి నూతన ఎస్‌ఐగా ఎస్‌కె.యాకూబ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన సూర్యాపేట 2 టౌన్ ఎస్‌ఐగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఇందనూరి మహేందర్‌నాథ్ సూర్యాపేట 2టౌన్‌కు బదిలీపై వెళ్లారు. కాగా జనవరి 29న మహేందర్‌నాథ్ సూర్యాపేట 1టౌన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కేవలం 45రోజులు మాత్రమే పనిచేసి తక్కువ కాలంలో బదిలీపై వెళ్లడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ఎమ్మెల్యే పరామర్శ


ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని మాలిపురం గ్రామానికి చెందిన జంపాల యాదగిరి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే మందుల సామేల్ పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్, సుంకరి జనార్దన్, డానియల్, తిరుమని యాదగిరి, రామ్మూర్తి, సుధాకర్, జమ్మిలాల్, పేరాల వీరేష్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

తిరుమలగిరి (తుంగతుర్తి) : మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం శివారులో గల బిక్కేరు వాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఆదివారం ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా

ఆత్మకూర్ (ఎస్) : బీఆర్‌ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి తన రాజీనామా లేఖను పంపినట్లు ఆయన వెల్లడించారు. 20ఏళ్లుగా తెలంగాణ ఉద్యమంతో పాటు పార్టీ కోసం ఫుల్‌టైమ్ కార్యకర్తగా పనిచేశానని, ప్రస్తుతం కుటుంబ ఇబ్బందుల నేపథ్యంలో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

కష్టపడి చదివితే లక్ష్యసాధన సాధ్యం

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు కష్టపడి చదివితే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుధాకర్ పీవీసీ సౌజన్యంతో సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలెంల, అర్వపల్లి, చివ్వెంల, ఆత్మకూర్(ఎస్), మోతె, నూతనకల్ కేజీబీవీల్లో, పాతర్లపహాడ్, ఏనుభాముల, నామవరం పాఠశాలల్లో పరీక్ష సామగ్రి అందజేసినట్లు తెలిపారు. సమాజంలో విద్య, వైద్య రంగాలకు చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు ఉప్పు నాగయ్య, బత్తుల దామోదర్‌రెడ్డి, కాళిదాసు, శమంతకమణి, పుండరీకచారి, వెంకటయ్య, ఝాన్సీ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ పదోతరగతి విద్యార్థులకు మేడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్టడీ మెటీరియల్, ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ మేడి కృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థులు పదోతరగతి పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైతే బహుమతి అందజేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో బొడ్డు మహేష్, శ్రీనాథ్, నవీన్, మురళి, థామస్, రాజేష్ చంద్ర, తేజ పాల్గొన్నారు.


సూర్యాపేటటౌన్ : పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న యాస రాంకుమార్‌రెడ్డి

పరీక్ష సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి : విద్యార్థులు పరీక్ష సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం లింగయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తగూడెం జెడ్పీహెచ్‌ఎస్ 2007–2008 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ప్రస్తుత పదోతరగతి విద్యార్థులకు అందించిన పరీక్ష సామగ్రిని ఆయన అందజేసి మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాఠశాలలో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థులు పరీక్ష సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, పూర్వవిద్యార్థులు చంటి, మధు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న మేడి ఫౌండేషన్ సభ్యులు


తుంగతుర్తి : విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో సోమవారం నుంచి నిర్వహించే పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి ఐ.శాంతయ్య ఆదివారం తెలిపారు. పరీక్షకు స్థానిక జెడ్పీ పాఠశాలలో 200మంది, ఫాతిమా హైస్కూల్‌లో 200మంది, కృష్ణవేణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 140మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు కేంద్రాలకు అరగంట ముందే హాజరు కావాలన్నారు.

తుంగతుర్తి : నేటి నుంచి నిర్వహించే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏంఈఓ బోయిని లింగయ్య తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఇన్విజిలేటర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పరీక్షలో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా చూడాలన్నారు. మండల కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ గిరిజన బాలికల గురుకుల పాఠశాల, మేరిమథర్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో యాకయ్య, సహదేవ్, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

నూతనకల్ : పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి రాములునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 460మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 210మంది, విజయమేరి పాఠశాలలో 250మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.


తుంగతుర్తిలో ఇన్విజిలేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏంఈఓ లింగయ్య

పెన్‌పహాడ్ : పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను వారు పరిశీలించి మాట్లాడారు. మండలంలో 11పాఠశాలలకు చెందిన 325మంది పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, మంచినీటి సౌకర్యం, విద్యుత్, టాయిలెట్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్‌ఐ రవీందర్ తెలిపారు.

అర్వపల్లి : మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్, కేజీబీవీలలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ బి.బాలునాయక్ తెలిపారు. ఆదివారం అర్వపల్లిలోని రెండు కేంద్రాలలో ఆయన ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. జాజిరెడ్డిగూడెం, నాగారం రెండు మండలాలకు సంబంధించి 320మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట సీఎస్‌లు, డీఓలు భాస్కర్, రామారావు, వెంకటేశ్వర్లు, వెంకన్న, ఎస్ఓ నాగరాణి, సిబ్బంది యోగాచార్య, డాక్టర్ పగిళ్ల సైదులు, రాచకొండ ప్రభాకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.


పెన్‌పహాడ్ : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


అర్వపల్లిలోని కేజీబీవీ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఈఓ బాలునాయక్

ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలి

నూతనకల్ : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం విధించిన నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, ఎస్‌ఐ సైదులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల నియమావళి ప్రకారం గోడలపై రాతలు రాయడం, పోస్టర్లు అంటించడంతో పాటు కటౌట్‌లు, ప్లెక్సీలు, జెండాలను పబ్లిక్ ప్రదేశాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేయరాదని వారు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఫ్లెక్సీని తొలగిస్తున్న అధికారులు

రైతు రుణమాఫీ తక్షణమే అమలు చేయాలి



ప్రదర్శనలో పాల్గొన్న ఏఐకేఎంఎస్ నాయకులు

అర్వపల్లి : రైతులకు తక్షణమే రూ.2లక్షల రుణమాఫీ చేసి పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అర్వపల్లిలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చిందని, ఈ హామీని వెంటనే నెరవేర్చాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేలు చెల్లించాలని, ఈ సీజన్ నుంచి ధాన్యానికి క్వింటాకు రూ.500బోనస్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పోలెబోయిన కిరణ్, మధు, కాశయ్య, సుధాకర్‌రెడ్డి, లింగయ్య, గణేష్, వీరాచారి, లింగమల్లు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతికి పాలకులు కృషిచేయాలి

దురాజ్‌పల్లి(సూర్యాపేట) : దేశాల మధ్య సోదర భావం నెలకొల్పి ప్రపంచశాంతికి పాలకులు కృషి చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో నిర్వహించిన అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మత సామరస్యాన్ని నెలకొల్పి రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు పాటు పడాలన్నారు. ప్రపంచంలో ఘర్షణకు తావులేని యుద్ధ రహిత సమాజం కోసం శాంతికాముకులు, మేధావులు, అభ్యుదయ వాదులు అందరూ కృషి చేయాలన్నారు. ఇటీవల పరిణామాలు చూస్తుంటే రాజ్యాంగబద్ధమైన పాలనకు బదులు సెక్యులర్ విధానానికి తూట్లు పొడిచే విధంగా పాలకులు వ్యవహరించడం బాధాకరమన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తొగిటి మురళి, బొమ్మగాని శ్రీనివాస్, అనంతుల మల్లీశ్వరి, బూర వెంకటేశ్వర్లు, పెంట్రా కృష్ణ, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీఎల్

నేడు మండల సర్వసభ్య సమావేశం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : విద్యుత్ లేన్లకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా నేడు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ సురేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రెడ్డిగూడెం, గోరెంట్ల, చందుపట్ల గ్రామాలకు సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు అంతరాయం ఏర్పడనున్నట్లు ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


గాయపడిన గీత కార్మికుడు మామునూరి శ్రీను

మద్దిరాల : తాటి చెట్టు పైనుంచి పడి ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మామునూరి శ్రీను రోజు మాదిరిగానే సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా కాలు జారీ చెట్టు పైనుంచి కింద పడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన చుట్టు పక్కల వారు 108లో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

అర్వపల్లి : మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఆదివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు ఉచితంగా టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ పశువులకు టీకాలను వేయించాలని కోరారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్ఎస్, పద్మ, సిబ్బంది యాదగిరి, యాకయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్రీతమ్ ఎన్నిక హర్షణీయం

నూతనకల్ : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరిగారి ప్రీతమ్‌ను ప్రభుత్వం నియమించడం హర్షణీయమని నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు భోనగిరి లింగయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ప్రీతమ్ సేవలను పార్టీ గుర్తించి కార్పొరేషన్ చైర్మన్ పదవిని అప్పగించడం సంతోషదాయకమన్నారు.

ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు


చైర్మన్ ఫహీమ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపేందర్‌గౌడ్

నాగారం : మండలంలోని పసునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిత్తలూరి ఉపేందర్‌గౌడ్ ఆదివారం హైదరాబాద్‌లో ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఎం.ఏ.ఫహీమ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు ఏర్పాటు


సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసు సిబ్బంది

పెన్‌పహాడ్ : మండలంలోని సూర్యాపేట–మిర్యాలగూడెం ప్రధాన రహదారిపై ఇటీవల తరచూ ప్రమాదాలు చోటు చేసుకోవడంతో ఎస్‌ఐ రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ రవీందర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు వాహనాలకు సరైన ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ యాదగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

చిలుకూరు : మండలంలోని బేతవోలు గ్రామానికి చెందిన మంత్రిప్రగడ హనుమంతరావు దేవాదాయ శాఖ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆదివారం గ్రామంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆయన కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కుటుంబసభ్యులు ప్రమీల, రమేష్, సాయి ప్రణవ్, అర్చకులు శ్రీనరగరినాథుని నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన జలాలు.. ఎండుతున్న పంటలు

అర్వపల్లి : మండలానికి వారబందీ విధానంలో గోదావరి జలాలను వదులుతామని నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించినప్పటికీ ఆ నీటిని తగ్గించడం, వారబందీ విధానాన్ని సరిగా పాటించకపోవడంతో మండలంలోని ఆయకట్టు పంటలు ఎండిపోతున్నాయి. మండలానికి ఎస్సారెస్పీ గోదావరి జలాలను అకస్మాత్తుగా నిలిపి వేయడంతో అలాగే ఈ సీజన్‌లో తక్కువ నీరు వదలడంతో మొదటి నుంచి వరిపంటలకు సరిపోను నీరు అందడం లేదు. మండలంలో 90శాతం మంది రైతులు గోదావరి జలాలపై ఆధారపడి వరి పంటలను సాగుచేశారు. ఈ సీజన్‌లో మండలంలో సుమారు 22వేల ఎకరాల్లో వరిపంటలు సాగుచేస్తున్నారు. కాని రెస్సారెస్పీ నుంచి నీటి విడుదల సక్రమంగా లేకపోవడంతో మండల పరిధిలోని పలు గ్రామాల్లో వరి పంటల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటి నుంచైనా పంటలు చేతికొచ్చే వరకు గోదావరి జలాలను తగుస్థాయిలో విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయా గ్రామాల అన్నదాతలు అధికారులకు మొరపెట్టుకుంటున్నారు.


రామన్నగూడెం శివారులో ఎండుతున్న వరిపొలం